
ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



సంపుటి : 9 సంచిక : 18 పుష్పం : 37-38 05-6-2004

**RAMANA BHASKARA**
*TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE*
PAGES : 16
VOL : 9 ISSUE : 18

EDITOR
*P.S. RAMA RAJU*

EDITING
*P.H.V. SATYAVATHI*
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

PUBLISHER
**P.S. RAMARAJU**
LAKSHMI
MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 224589, 224689

PRINTER
**SHRIRAM GRAPHICS**
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 222438, 221260
94401-31188

## భిన్నత్వం ఏకత్వంపై ఆరోపణయే

కేవలం ఉన్నదే బ్రహ్మము, బ్రహ్మము కన్న భిన్నముగా అనగా రెండవదిగా ఏదీ లేనే లేదు, అదియే సకల శాస్త్ర సాధనల గమ్యము, సారము. గురువు, ఆత్మ, నేను, చైతన్యము, ఈ విధంగా ఏ పేరుతో పిలిచినా ఆ ఏకైక సత్యాన్నే. ఏ బుద్ధితో ఏకత్వంలో భిన్నత్వాన్ని గ్రహిస్తున్నామో, అదే బుద్ధితో భిన్నత్వంలో ఏకత్వాన్ని అనగా కేవలం మహాచైతన్యమే భ్రాంతి వలన ఆరోపణ వలన అనేకంగా గోచరిస్తుందని మనము గ్రహించాలి. అనేకంగా కనబడేదంతా ఏకత్వంలో ఆరోపణ మాత్రమే. ఆకాశంలో నీలపు రంగును ఆరోపిస్తున్నాము, కాని వాస్తవంగా ఆకాశం నీలపు రంగుచేత అంటబడదు. మూలతలంపు ఉదయించాక దానికొచ్చే అనేక తలంపుల సముదాయమే జగత్తు. జగత్తు అనగా తలంపులే. మూలతలంపుకు ఆధారం చైతన్యమే, అదే 'నిజమైన నేను'. నేనెవరో? అనగా 'నిజమైన నేను'ను అనుభవంలోనికి తెచ్చుకొనే మహత్తర కార్యం నిమిత్తం మనము భూమి మీదకు వచ్చాము. ఆత్మజ్ఞానము అనగా సర్వత్ర తానే ఉండడాన్ని గుర్తించిన ఎరుక. అట్టి ఎరుక ఎవరో కాదు నా స్వరూపమైన సచ్చిదానందమే. అట్టి నా స్వరూపమైన శుద్ధ చైతన్యమే అనంతంగా, అద్భుతంగా, కేవలంగా భాసిస్తూ ఉంటుంది. అట్టి చైతన్యాన్ని స్వరూపంగా అనుభవంలోనికి తెచ్చుకోవడమే జీవిత గమ్యం.

**చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

02-03-04 లంకలకోడేరు ........ 2
05-03-04 సీసలి ........ 10



## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 2-3-04, లంకలకోడేరు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నీవు జీవించు, 100 సంవత్సరాలు జీవించు కాని ఎలా జీవించాలంటే ఆత్మవిశ్వాసంతో జీవించు, ఆత్మబలంతో జీవించు, ఆత్మజ్ఞాన సముపార్జనలో జీవించు అని ఉపనిషత్‌లు చెప్పాయి. ఇప్పడు మనం మన ఇంద్రియాలు, మనస్సుకు పాలేరుతనం చేస్తున్నాము. ఇంతకంటే బాహ్యంగా ఏదైనా నౌకరీ చేసుకోవటం మంచిది. గాంధీగారికి ఆయన ఇంద్రియాలు మనస్సు చాకిరీ చేసినాయి కాని మనం వాటికి చాకిరీ చేస్తున్నాము. కర్త నీవు కాదు, కర్త ఈశ్వరుడు. నీ శరీరం ద్వారా ఏ పని అయితే జరగవలసిఉందో అది జరిగిపోతూ ఉంటుంది. అది నీకు ఇష్టంఉన్నా లేకపోయినా, నీ సంకల్పంతో సంబంధం లేకుండా నీ శరీరం ఈ భూమి మీదకు ఎందుకు వచ్చిందో ఆ పని జరిగిపోతూ ఉంటుంది. కాని నీవు ఒకటి నేర్చుకోవాలి. ఆపనికి నేను కర్తను అని అనుకోవద్దు. ఆపని అయిపోతుంది, దుఃఖం నశిస్తుంది అని భగవంతుడు గీతలో చెప్పాడు. ఉన్నది ఒక్కటే వస్తువు, దానికి భిన్నంగా నీవు ఏదైనా చూస్తూఉంటే, ఏదైనా ఆలోచిస్తూ ఉంటే ఈ జన్మలో కాకపోయినా రాబోయే జన్మలో అయినా అదే నీదుఃఖానికి కారణం అవుతూ ఉంటుంది, టెన్షన్‌కు కారణమవుతూ ఉంటుంది, ఇది బాగా అర్థంచేసుకోవాలి. భగవంతుడు అంతటా ఉన్నాడు, మనలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయన సూక్ష్మరూపంలో ఉన్నాడు, సూక్ష్మరూపంలో ఉన్న వస్తువు స్థూలబుద్ధికి అందదు. భగవంతుడుని నమ్మినవాడికి ఆయన ఎరుకలోనికి వస్తాడు. వివేకం లేకుండా, వైరాగ్యం లేకుండా అంతర్యామిగా ఉన్న సూక్ష్మాతిసూక్ష్మమైన వస్తువు మనకు అనుభవంలోనికి రాదు. మనం ప్రయాణించే మార్గం మోక్షమార్గం అయిఉండాలి. మనం వెళ్ళేమార్గం మోక్షమార్గం అయితే ఒక జన్మో, రెండు జన్మలో ఆలస్యమైన మోక్షానికి వెడతాము. అసలు మనం ప్రయాణించే మార్గం మోక్షమార్గం కానప్పడు కోటిజన్మలు ఇలా ప్రయాణం చేసినా మోక్షాన్ని పొందలేము.

కొంతమందికి లోకం తప్పించి మరణానంతరజీవితం ఏమీలేదు అనుకొంటారు. నిరంతరం లోకంగొడవలలో ఉంటారు, మరణానంతరం వారికి చీకటిలోకాలు మిగులుతాయి, అది ప్రేయస్సు మార్గము. మనం శ్రేయస్సు కలిగే మార్గంలోనికి వెళ్ళాలి కాని మనకు శ్రేయస్సు కంటే ప్రేయస్సు అంటే ఎక్కువ ఇష్టం. కొంతమంది ధర్మబద్ధంగా జీవిస్తారు. ధర్మానికి విరుద్ధంగా నడుచుకోమని ఎవరైనా చెప్పినా వినరు. సింహాసనం తీసుకోమని భరతుడికి తల్లి కైకేయి ఎంతచెప్పినా ఆయన అంగీకరించలేదు. తల్లి మీద గౌరవం ఉన్నప్పటికి ధర్మవిరుద్ధంగా చెపుతోంది కాబట్టి తల్లి మాట వినలేదు, భరతుడు

ధర్మమార్గాన్ని విడిచిపెట్టలేదు, మోక్షమార్గాన్ని విడిచిపెట్టలేదు. తల్లి సలహాను బట్టి రాజ్యాన్ని అంగీకరించాడు అనుకోండి అది ప్రేయస్సుమార్గం. మనం ఎప్పుడూ మనకు శ్రేయస్సు కలిగించే మార్గంలోనికి వెళ్ళాలి, మోక్షమార్గంలోనికి వెళ్ళాలి. ఆమార్గంలో ఉన్నామా, లేదా అని ఏ క్షణానికి ఆక్షణం చూసుకొంటూ ఉండాలి. మనం భగవంతుడికి వేరుగాలేము, భగవంతుడిలోనే ఉన్నాము కాని దాని తాలుక అనుభవం లేకపోవటం వలన దుఃఖం వస్తోంది. మన అంతఃకరణంలో ఉన్న దోషాలను తొలగించుకోవటం కోసం, మనకు ఉన్న వేరుబుద్ధిని తొలగించుకోవటం కోసమే పూజ, జపం, ధ్యానం, విచారణ. మనం ఏదిగా ఉన్నామో దాని తాలుక ఎఱుక మనకు ఉన్నప్పుడు, ఆవస్తువు తాలుక ప్రత్యక్షఅనుభవం ఉన్నప్పుడు జపధ్యానములతో పనిలేదు. మనలోపల సత్యవస్తువు ఉంది కాని మన బుద్ధిలో ఉన్న దోషాలవలన ఆవస్తువు ఉందని మనకు తెలియటంలేదు. అసలు మనం సాధన అంటూ చేస్తూఉంటే అందులో సక్సెస్ అవ్వవచ్చు, అవ్వలేకపోవచ్చు అది వేరే విషయం. కాని భగవదనుభవం కోసం మనం చేసే ప్రయత్నం అంతా, సాధన అంతా కూడా వచ్చే జన్మలో మనకు కలిసివస్తుంది. జీవితం అన్నీ తలంపులే కాని తలంపులులేని సద్వస్తువు ఒకటి మన హృదయంలో ఉంది. గాఢనిద్రలో మనకు తలంపులు లేవు కాని అది ఉంది, దానికి దేనితోనూ తాదాప్యం లేదు. గాఢనిద్రలో మనం సుఖంగా, శాంతిగా, ఆనందంగా ఉన్నాము. గాఢనిద్రలో ఉన్న ఆనందానికి బాహ్యవస్తువుల సపోర్టు గాని, వ్యక్తుల సపోర్టుగాని ఏమీలేదు. ఇంద్రియాలకు సంబంధించిన విషయాలు గాని, గుణాలకు సంబంధించిన విషయాలు గాని, ప్రాపంచిక విషయాలు గాని వేటితోను సంబంధంలేకుండా గాఢనిద్రలో మనం స్వతంత్రంగా సుఖాన్ని అనుభవిస్తున్నాము. అది జాగ్రదవస్థలో కూడా ఉంది. ఈ శరీరానికి మరణం రాకముందే దానిని మనం అనుభవైకవేద్యం చేసుకొంటే మృత్యువును జయించి అమృతత్వాన్ని పొందుతాము. ఇదే మన జీవిత గమ్యం.

ఈ లోకంలో అనేకవిద్యలు ఉన్నాయి. ఒక్క ఆత్మవిద్య తప్పించి మిగిలినవన్నీ పొట్టకోసమే. ఆత్మవిద్య వలన మాత్రమే ఆత్మ ఎరుకలోనికి వస్తుంది. లౌకికవిద్యలు కూడా మనం సరిగా నేర్చుకోవటం లేదు. ఏదో ఉద్యోగంకోసం, పొట్టకోసం నేర్చుకొంటున్నాము కాని హృదయపూర్వకంగా నేర్చుకోవటం లేదు, సబ్జక్టుకోసం మనం నేర్చుకోవటంలేదు. మనకు పనియందు బాధ్యత లేదు, కాలం విలువ తెలియటం లేదు. మనలో ఎక్కువమంది పనిదొంగలు, జీతం పుచ్చుకోవాలి, పని చెయ్యకూడదు. పట్నవాసంలో సుఖపడుతున్నారు, అన్ని సౌఖ్యాలు ఉంటున్నాయి, పల్లెటూరిలో కూడా అన్నీ ఉండాలి వారు కూడా పౌరులేకదా, వారూ ప్రజాస్వామ్యంలో భాగమే కదా అని రాష్ట్రపతి గారు చెపుతున్నారు. మనకు మానవజాతి మీద ప్రేమ ఉంటే, తోటి మానవుడిపట్ల గౌరవం ఉంటే మన సాధనతో నిమిత్తం లేకుండా



ఉదాత్తమైన ఆలోచనలు వస్తాయి. ఇప్పుడు మనకు రాజకీయరంగంలో ఎక్కువమంది ఉంటున్నారు, సంఘసేవలో తక్కువమంది ఉంటున్నారు. సమాజానికి సేవ చేయటానికి ఇష్టపడటంలేదు, యజమానిగా ఉండాలని చూస్తున్నారు. ఇంటిలో పనిచేయకూడదు, కాని పెద్దరికం కావాలి ఇదీ మనపరిస్థితి. ఈశ్వరుడిపట్ల భక్తి కలిగి ఉండాలి, కృతజ్ఞతకలిగి ఉండాలి, విశ్వాసరాహిత్యం పనికిరాదు, ఈశ్వరుడి పట్ల విశ్వాసం కలిగిఉండాలి. మన అతఃకరణం పరిశుద్ధమయితే గాని లోపలఉన్న ఈశ్వరుడు మనకు వ్యక్తం కాడు, మనం ఆయనను మాయ చేయలేము. ఎక్కడైతే స్నేహం ఉందో అక్కడ శాంతి ఉంటుంది, ఎక్కడైతే విరోధం ఉందో అక్కడ అశాంతి ఉంటుంది. మీరు అందరిపట్ల స్నేహంగా ఉంటే శాంతి వస్తుంది, విరోధంగా ఉంటే అశాంతి వస్తుంది. మీరు భారతదేశానికి అధిపతి అయినప్పటికీ మీకు ద్వేషం ఉంటే చివరకు మిగిలేది అశాంతే. మనం ఈశ్వరుడిని ప్రేమిస్తూ ఉంటే, ఆయన పాదాలను ఆశ్రయిస్తే సహజంగా లోపలఉన్న పసరు, కల్మషం అంతా దానంతట అదే బయటకు వచ్చేస్తూ ఉంటుంది. ఎంతకాలం అయితే లోపల పసరు ఉందో మనం వికారం ఆపుచేసుకోలేము, ఆ పసరు అంతా పోయిన తరువాత వికారం రమ్మన్నా రాదు. అలాగే మన బుద్ధిలో ఉన్న దోషాలు అన్నీ నశించాక మనం సాధన చేద్దామన్నా చేసేవాడు అక్కడ ఉండడు.

నేను జపం చేసుకొంటున్నాను అని ఒకరు భగవాన్‌తో అంటే జపం చేసుకో, అభ్యాసాన్ని కొనసాగించు. అభ్యాసం వలన మనం అభివృద్ధిలోనికి వస్తాము. నీవు చిన్న పనికూడా పెద్దమనస్సుతో చేయాలి. భగవంతుడు చెప్పిన వాక్యం నందు గౌరవం లేనప్పుడు భగవంతుడు అనుభవంలోనికి రాడు. నీవు చేసే పనులను గమ్యంగా పెట్టుకోవద్దు, నన్ను గమ్యంగా పెట్టుకో, నీవు పూజ చేసినా, జపంచేసినా, ధ్యానం చేసినా నన్నేగమ్యంగా పెట్టుకో అప్పుడు నన్ను పొందుతావు అని భగవంతుడు చెపుతున్నాడు. చిల్లరవిషయాలను గమ్యంగా పెట్టుకొంటే అవి నెరవేరినా కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. నేను చెప్పే మాటకు సంబంధించిన ఎరుక నాకు లేకపోతే నేను ఎంతసేపు చెప్పినా దానివలన ప్రయోజనం లేదు, నాకు శక్తి వృధాఅవుతుంది, మీకు టైము వృధాఅవుతుంది. నేను మద్రాసులో ఉండి దగ్గరగా ఉన్న రమణమహర్షిని చూడలేకపోయాను. ఎప్పుడో పూర్వకాలంలో ఉన్న వశిష్ఠుడిని చూడలేను, ఇప్పుడు ఉన్నవాడిని కూడా చూడలేకపోయాను, అది నా పాడుబుద్ధికి నిదర్శనం అన్నాడు ఒక భక్తుడు. అంటే ఆయనలో ఉన్న లోపం ఆయనకు గుర్తుకు వస్తోంది, తెలుస్తోంది, అది బాగుపడేవాడి లక్షణం. తోటిమానవుడి ద్వారా, లోకం ద్వారా, విషయాల ద్వారా, గుణాల ద్వారా మనం ఏ సుఖాలు అనుభవించినా పరిణామంలో ఇవిఅన్నీ దుఃఖంగా మారిపోతాయి, మరల ఎత్తుకు ఎత్తు అనుభవించవలసిందే. మనం కోరిక లేకుండా

పనిచేస్తే ఫలితం వస్తుంది, చిత్తశుద్ధి కలుగుతుంది. కోరిక పెట్టుకొని పనిచేస్తూ ఉంటే దాని ఫలితం వస్తుంది, అనుభవిస్తే అది పోతుంది, చిత్తశుద్ధి కలుగదు. మనం పూజచేసినా, జపంచేసినా, ధ్యానంచేసినా, విచారణచేసినా, సత్పురుషులతో సహవాసం చేసినా గమ్యం ఒక్కటే అంతఃకరణశుద్ధి. అంతఃకరణంలో చిన్న దోషం మిగిలినా మనం ఆత్మాకారం చెందలేము, హృదయంలో లయం అవ్వలేము.

మీరు భగవదనుభవం పొందాలి అనుకొన్నప్పుడు, దానికి సహకరించే మాటలు మాట్లాడండి. సద్వస్తువుతో సంబంధం ఉన్న మాటలనే మాట్లాడండి, సద్వస్తువుతో సంబంధంలేని మాటలు ఎందుకు? జ్ఞానం, జ్ఞానం అంటున్నారు అందులో నేను ఒక్కడినే అయిపోతాను అంటున్నాడు. మరి గాఢనిద్రలో నీవు ఎలాగ ఉన్నావు? నీవు ఒంటరిగానే ఉన్నావు కదా, అది నీకు అవగాహనకు రావటంలేదు. అసలు వస్తువుకు తలంపులులేవు, తలంపులు అన్నీ అహంకారానికే. నామం చేయటం వలన నీకు ఉపయోగం లేని తలంపులు రాకుండా అది రక్షణగా ఉంటుంది, మీరు ఏదేవతనయితే స్మరిస్తున్నారో ఆదేవత తాలుక దయనుకూడా పొందుతారు. మనకు కనిపించే మనుషుల మీద గౌరవం లేనప్పుడు, ప్రేమలేనప్పుడు కనిపించని దేవుడిమీద ప్రేమ ఎలాకలుగుతుంది. ఈశ్వరుడు రూపరహితుడు, నామరహితుడు, కాని రూపాలను ధరించేవాడు ఆయనే, ఈశ్వరుడు అంతర్యామిగా లేకుండా ఒక్క రూపం కూడా ఈసృష్టిలోనికి రావటానికి అవకాశం లేదు. అందుచేత నామరూపములను చూడవద్దు, అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని చూడండి. అప్పుడు హెచ్చుతగ్గులు ఆగిపోతాయి. ఈశ్వరుడికి భిన్నంగా ఏది చేసినా అది మీ దుఃఖానికి కారణం అవుతుంది. మీ కోడలు కోపంగా చూసింది అనుకోండి. మా కోడలు కోపంగా చూసింది అనుకోవద్దు, కోడలు ద్వారా చూసేవాడు కూడా ఈశ్వరుడు అనుకోండి, అక్కడ కూడా ఈశ్వరుడినే చూడండి, ఈశ్వరునికి భిన్నంగా ఏదీ చూడవద్దు. అప్పుడు మీరు అశాంతిలోనికి, దుఃఖం లోనికి రావలసిన పనేఉండదు. మీ అంతఃకరణంలో ఉన్న దోషాలను తీసివేయటానికి ఈశ్వరుడు అలా చేస్తూఉంటాడు. మనకు ఎక్కడికి వెళ్ళినా బ్రహ్మమే కనబడుతోంది అనుకోండి, అప్పుడు మనస్సుకు చాపల్యమే ఉండదు. సహజస్థితి పొందినవాడు శరీరం ఉన్నా, లేకపోయినా ఒకేరకంగా ఉంటాడు, అంతా తానై ఉంటాడు. మనం రకరకాలుగా ఉంటాము. ఒంటరిగా ఉంటే ఒకలాగ, పదిమందిలో ఉన్నప్పుడు ఒకలాగ ఉంటాము, దానికి కారణం మనలో ఉన్న వేరుబుద్ధి, అది పోతేగాని మనకు ఆత్మజ్ఞానం కలుగదు. నీకు శాంతచిత్తము లేనప్పుడు, నీలో వేరుబుద్ధి నశించనప్పుడు నీకు ఆత్మజ్ఞానం ఏమిటి? నీకు ఆత్మజ్ఞానం కలుగదు, సూక్ష్మాతిసూక్ష్మంగా ఉన్నవస్తువు నీకు ఎరుకలోనికి రాదు. మనలోపలఉన్న సత్యవస్తువు మనకు అనుభవంలోనికి వచ్చాక చూడటానికి ఏమీ లేదు, వినటానికి ఏమీలేదు ఎందుచేతనంటే కళ్ళ ద్వారా చూసేవాడు, చెవుల ద్వారా వినేవాడు అక్కడలేడు. కొంతమంది వారికి కలిసివస్తే పనిచేస్తారు లేకపోతే పనిచేయరు, వారిని కూలివారు అంటున్నాడు భగవంతుడు, వారికి వంద కోట్ల డబ్బు ఉన్నా వారునాదృష్టిలో కూలివారు అంటున్నాడు. ఉన్నది ఒక్కటే, అది తప్పించి ఏదో ఉంది, ఏదో ఉంది అని నీవు అనుకొన్నా అది కల్పితం మాత్రమే, నీ ఊహ మాత్రమే. నీ మనస్సు ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. జపం చేయగా చేయగా నీకు ఉపయోగం లేని తలంపులు అన్నీ ఆగిపోతాయి. అప్పుడు జపం చేసే జపి ఎక్కడనుండి అయితే ఉదయించి వచ్చాడో అక్కడకు ఉపసంహరింపబడి హృదయంలో ఐక్యం అవుతాడు.

మనలను మనం తెలుసుకొంటే ఆత్మను తెలుసుకొన్నట్లే ఎందుచేతనంటే మనం ఆత్మ అయి ఉన్నాము. మనలను మనం తెలుసుకొన్నాక లోకాన్ని చూస్తే అది మనలను ఆకర్షించదు, లోకం కూడా ఆత్మగానే మనకు కనబడుతుంది. మనలను మనం తెలుసుకొన్నాక జీవితానికి, మరణానికి ఉన్న బేధం కూడా కనిపించదు. అది సున్న అయిపోతుంది. అక్కడికి మేల్కొలపటానికే ఈజ్ఞానయజ్ఞాలు. మీకు ఆత్మజ్ఞానం రావాలంటే గుంజీలు తీయనక్కరలేదు, వళ్ళంతా బాడి చేసుకోనక్కరలేదు, ఇంట్లో పని మానివేసి ఎక్కడికో పారిపోనక్కరలేదు, ఏమీ చేయనక్కరలేదు, ఏమీ అనుకోవటం మానివేయండి అన్నారు భగవాన్. భగవాన్ చెప్పిన ఈ వాక్యం అంటే నాకు చాలా ఇష్టం. మీరు పెద్దవారు అనుకోవద్దు, తక్కువవారు అనుకోవద్దు, ధనవంతులు అనుకోవద్దు, పేదవారు అనుకోవద్దు, ఈ అనుకోవటాలు మానివేయండి, అనుకోవటాలు లేని సద్వస్తువు మీకు ఎరుకలోనికి వస్తుంది. అనుకొనేది అహంకారం. అనుకోవటం మానివేస్తే అహంకారానికి ఫుడ్ సప్లయి ఆగిపోయి అహంకారం నశిస్తుంది, ఇప్పడే ఇక్కడే అమృతానుభవం పొందవచ్చును.

మనం పవిత్రులం అవ్వటానికి ఒక్క రామనామం చాలు. మన బుద్ధిలో ఎన్ని వంకరలు ఉన్నా, ఎన్ని దోషాలు ఉన్నా వాటిని తొలగించి బుద్ధిని సమానం చేయటానికి ఒక్క రామనామం చాలు. మనలో ఉన్నదోషం ఏమిటి అంటే మనం విశ్వాస హీనులం, ఉండవలసినంత విశ్వాసం మనకు లేదు. భగవంతుడి పట్ల విశ్వాసం అవసరం. భగవంతుడు లేడని బ్రతకటంకంటే భగవంతుడు ఉన్నాడని బ్రతకడమే మంచిది. భగవంతుడులేడని బ్రతుకుతున్నాము అనుకోండి భగవంతుడు ఉంటే అప్పుడు మనం ఏమౌతాము. ఇటువంటి చిక్కులలో ప్రమాదాలలో పడ్డాము ఏమిటి అని కొంతమంది అనుకొంటూ ఉంటారు. మీరు అంటే ఇష్టంలేక భగవంతుడు ఆ చిక్కులలో పెట్టలేదు, మీకు కొన్ని పాఠాలు నేర్పటానికే ఆ చిక్కులు పెట్టాడు. మిమ్మల్ని ఎప్పడూ అక్కడ ఉంచి వేయడు, పాఠాలు నేర్చుకొన్నాక అందులోనుండి బయటకు తీసుకొని వచ్చేస్తాడు.

విశ్వాసహీనుడు ఎప్పడూ బాగుపడడు. విశ్వాసపాత్రుడిని తగిన సంపదతోను, కళ్యాణ గుణాలతోను భగవంతుడు అలంకరింపజేస్తాడు. విశ్వాసపాత్రుడు ఎప్పడూ నశించడు, విశ్వాసహీనుడు నశిస్తాడు. జపం యాంత్రికంగా చేయకూడదు. నీవు శ్రద్ధగా, త్రికరణ శుద్ధిగా జపంచేస్తూ ఉంటే నీ హృదయంలో ఉన్న నిజాన్ని నీకు పట్టి ఇస్తుంది. నీవు శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించు, శాస్త్రాన్ని విడిచిపెట్టవద్దు. నీవు జపం చేసినా, ధ్యానం చేసినా అది సహజం అయ్యేవరకు చెయ్యి. కొంతమంది ఇంటికి చుట్టాలు వస్తే కంగారు పడిపోతారు అంటే వారు సహజంగా లేరు అని అర్థం. అలా ఎందుకు కంగారు వస్తుంది అంటే వాడిని గౌరవించాలి, గౌరవించకపోతే వాడి అహంకారం ఏదో అనుకొంటుందని వీడి అహంకారం అనుకొంటుంది. మాటలో, చేతలో, నీ ప్రవర్తనలో సహజంగా ఉండటం నేర్చుకో. మన జీవిత విధానం ప్రేమ పూరితంగా ఉంటే, శాంతి పూరితంగా ఉంటే, కృత్రిమ రహితంగా ఉంటే లోపలఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది. నీ సాధనను పూజ గదికి పరిమితం చేయవద్దు, నీ సాధన సహజం అయిపోవాలి. మీకు తొందరగా నిద్ర పట్టటంలేదు అనుకోండి ఇష్టదైవాన్ని స్మరించుకోవటం వలన కూడా తొందరగా నిద్రవస్తుంది. మీకు నిద్రరాకుండా మంచం మీద పడుకోవద్దు. నిద్ర వచ్చేటైములో మంచం మీద పడుకొంటే వెంటనే నిద్ర వచ్చేస్తుంది. నిద్రరాకుండా మంచం మీద పడుకొంటే ఉపయోగంలేని తలంపులు, మనం చెడిపోవటానికి పనికి వచ్చే తలంపులు వస్తాయి. మనకు సాధన గుర్తుకు రావటం లేదు. ఎంత సేపు మంచం, కంచం గుర్తుకు వస్తున్నాయి. అస్తమాను శరీరధ్యాసలో ఉండకూడదు. కంచం ఉంది అనుకోండి, మనం అన్నం తినేసి దానిని ఒక ప్రక్కన పెట్టేస్తాము కాని అస్తమాను కంచం గురించి ఆలోచించము. అలాగే ఈ శరీరాన్ని కూడా అవసరమయినప్పడు ఉపయోగించుకొని ఒక ప్రక్కన పెట్టేయాలి కాని అస్తమాను శరీరధ్యాసలో ఉండకూడదు. అస్తమాను శరీరధ్యాసలో ఉంటే శవబుద్ధి పెరిగిపోతుంది, శివబుద్ధి తగ్గిపోతుంది. నీవు బాహ్యంగా ఏదో చేయటం వలన పొగతాగటం మాని వేయవచ్చు, సారా తాగటం మానివేయవచ్చు, ఆ అలవాట్లు మానవచ్చు, అది మంచిదే గాని లోపల వాటి మీద నీకు ఉన్న ఇష్టం, ఆ తలంపు మాత్రం దేవుని దయ లేకుండా నశించదు. మనదేహం ఒకకాలానికి, ఒకదేశానికి లోబడిఉంది. లోపల ఉన్న వస్తువు దేశకాలాలకు లోబడిలేదు. ఆ వస్తువు సహజంగా ఉంది, జ్ఞానంగా ఉంది, శాంతిగా ఉంది, ఆనందంగా ఉంది, అది అనుభవంలోనికి వచ్చిన తరువాత ఈ లోకాన్ని చూడటం ప్రారంభిస్తే అంతా ఆనందంగానే, శాంతిగానే కనబడుతుంది, నీవు ఆనందసాగరంలో ఊగిసలాడతావు. నేను ఒక్కడినే ఉంటానేమో, నాకు తోడు ఎవరూ ఉండరేమో అని ఇంతకుముందు ఒకరు అడిగారు కదా అసలు మనకు తోడు ఉండాలి అనే తలంపు కూడా అప్పడు ఉండదు.



మనస్సును బాహ్యముఖం చేసేది వాసనే. ఉపాసన లేకుండా, భక్తి లేకుండా వాసన నశించదు. అమెరికాలో వారు సంపాదించిన డబ్బునంతా వారసులకు ఇవ్వరు, కొంతభాగం వారసులకు ఇచ్చి, కొంత సమాజానికి ఉపయోగిస్తారు. సంపాదించినదంతా వారసులకు ఇస్తే వారు సోమరులవుతారు, మనమే వారిని పాడుచేసినట్లు అవుతుంది అంటారు. మనం మమకారంతో వారసులకు అంతా ఇచ్చేస్తాము. అంతేగాని వారిని ఉద్ధరించాలని ఇవ్వము. ధనంగాని, ఆస్తిగాని వచ్చేటప్పడు ఎలా వస్తుందో పోయేటప్పడు కూడా అలాగే పోతుంది, అది మనకు తెలియదు. ప్రారబ్దంలో ఉన్నది వస్తుంది, పోయేది పోతుంది, అదీ స్వప్నమే ఇదీ స్వప్నమే అన్నారు భగవాన్.

మనబుద్ధిని ముగ్గేసుకోవటానికి ఈ భూమిమీదకు వచ్చాము. మనబుద్ధి ముగ్గటానికి కొన్ని సంఘటనలను భగవంతుడు క్రియేట్ చేస్తాడు, వాటిని చూసి మనం కంగారుపడకూడదు. మన జీవితంలో లాభం వచ్చినా, నష్టంవచ్చినా సుఖం వచ్చినా దుఃఖం వచ్చినా అవి అన్నీ కూడా మనబుద్ధి ముగ్గటానికే. నిన్ను ఎవరైనా పిడకపెట్టి కొట్టారు అనుకో, ఆపిడకతో మరల వాడిని కొట్టవద్దు. ఆపిడకను తీసుకొని వెళ్ళి పొయ్యిలోపెట్టి కాఫీకాసుకో. నువ్వు నెగిటివ్‌గా ఉండవద్దు, ప్రతీవిషయంలోను పోజిటివ్‌గా ఉండు. మనకు అవగాహన చాలా ముఖ్యం, సబ్జక్టు చాలా ముఖ్యం. భగవాన్ చెప్పిన మాటలు మనం వింటున్నాము గాని వాటిప్రాధాన్యత మనం గ్రహించటంలేదు. ఎందుచేతనంటే మనకు ఏకాగ్రతలేదు, పవిత్రత లేదు, క్రమశిక్షణలేదు, ఆవిషయాలను జీర్ణంచేసుకోవటానికి తగిన అర్హత, యోగ్యతలేదు, పూర్వపుణ్యంలేదు. మీకోడలు సరిగాలేదు అనుకోండి, ఏమిటి భగవంతుడు ఇలాచేసాడు అనుకొంటాము. భగవంతుడు ఏమీ చేయలేదు, ఆయనకు మీమీద ఇష్టం లేకపోవటంకాదు, మీ దేహప్రారబ్దం, ఆవిడను మీకోడలుగా తీసుకొని వచ్చింది అంతే, దేవుడు కాదు. ఏదైతే పుట్టలేదో అది మనమై ఉన్నాము. పుట్టిన దానితో మనకు తాదాప్యం ఉంది కాని ఏదైతే పుట్టలేదో దానితో మనకు తాదాప్యంలేదు. దానితో తాదాప్యం వచ్చేవరకు ఇలాశవాలను మోస్తూ ఉండవలసిందే. మీ శరీరానికి రోగంవచ్చింది అనుకోండి, మందులు పేర్లు వినటం వలన ఆరోగం తగ్గదు. మందులు మింగటం వలన రోగం తగ్గుతుంది. అలాగే భగవంతుడు చెప్పిన మాటలను వినటం వలన మనస్సులో ఉన్న రోగంపోదు. ఆమాటలను శ్రద్ధగా విని, వాటిని మననం చేసుకొని, వాటిని ఆచరిస్తూ, వాటిని అనుభవంలోనికి తెచ్చుకోవటం వలన మనస్సులో ఉన్న రోగంపోతుంది, అంటే జన్మించటం మరణించటం అనే జబ్బు మనలను విడిచిపెడుతుంది. మనం ఇంద్రియాలకు, మనస్సుకు చాకిరి చేస్తున్నాము అనుకోండి జన్మించటం, మరణించటం అనేజబ్బులోనుండి బయటకు వచ్చే అవకాశం లేదు. నీ ఇంద్రియాలకు మనస్సుకు నీవు చాకిరీ చేయకుండా

